# అసలు రహస్యం

లక్ష్మినీ, ఆమె కొంటున్న క్వాలిస్‌ని చూడగానే, సుందరరావుకు ఆమెను పలకరించాలనిపించింది.

లక్ష్మి బాగా ఎత్తరి. సుకుమారి, సుందరి. ఎత్తుకు తగ్గలావు, సునాయాసంగా నడుస్తుంది. కల్లా కపటంలేని మనిషి.

ఆమెను చూడగానే రాజపుత్ర వంశంలో పుట్టిన క్షత్రియ వనిత అనిపించింది.

కార్ల షోరూంలో, కార్లను కాకుండా, ఆమెను చూస్తున్న సుందరరావును, ఆమే పలకరించింది.

'ఏమిటి చూస్తున్నారు?'

అతను ఇబ్బంది పడ్డాడు, కార్లను చూస్తున్నాననవచ్చు. అనలేదు. 'మిమ్మల్నే!' అన్నాడు.

'నన్నా? నా క్వాలిస్‌నా?'

'మిమ్మల్నీ, మీ క్వాలిస్‌నీ' ధైర్యం కూడగట్టుకుని చెప్పాడు. ఆమె గలగలా నవ్వింది. 'మీ నిజాయితీ నాకు నచ్చింది!' అంది.

'మంచి కారు, లేటెస్ట్ మోడల్, సుఖమైన ప్రయాణం, కుదుపుండదు, పవరు స్టీరింగ్, ఎ.సి. బెస్ట్ రోడ్‌గ్రిప్!'

'మీలాగే' అనుకొని, 'అందుకే మీరు కొన్నారు' అన్నాడు,

కారు తాళాలు చేతికిచ్చే లోపల చేసే తతంగమంతా చేస్తున్నారు షోరూం వాళ్ళు. డ్రైవరు ఆ పనిలో ఉన్నాడు.

వాళ్ళు తెచ్చి ఇచ్చిన కూల్‌డ్రింక్స్ తీసుకొని ఆమె రావుకు అందించింది. తాగుతుండగా 'ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం మీద మీ అభిప్రాయం ఏమిటి?' అని ప్రశ్నించింది లక్ష్మి.

ఉరుములేని పిడుగు. ఈప్రశ్న పరీక్షల్లో వస్తుందనుకోని విద్యార్థి పరిస్థితి.

'నాకు తెలియదు' నసిగాడు.

'నాకు తెలుసు! వేస్ట్!'

'ఏమిటి వేస్ట్?' అనబోయి, ఆగి, 'అలాగా' అని, 'అయితే సరే' అనేశాడు.

'తెలంగాణ రాష్ట్రంరాదు, రాకూడదు. అరిష్టం' అంది. అంత సులభంగా ఆ మాటలు అనకూడదు. అది ఆమె స్థిరాభిప్రాయంగా ఉంది.'

తెలుగుజాతి, తెలుగునేల, తెలుగుభాష ఒకే రాష్ట్రంలో కలిసి ఉండటం ఆమె అభీష్టం అయి వుండవచ్చు.

విషయం మార్చాలని రావు ఆమెను అడిగాడు 'మీకు పెళ్ళయిందా?'

పెటేల్మని నవ్వింది. "అయింది!"

"అయిందా?"

'పాతికేళ్ళ కొడుకున్నాడు!'

ఆమెను చూడగానే పాతికేళ్ళు ఉండవచ్చు ననుకొన్నాడు రావు. ఇప్పుడు నలభై ఏళ్ళు దాటవు అనుకొన్నాడు. చిన్నవయస్సులో పెళ్ళి చేసి ఉంటారని అనుకొన్నాడు.

ఆమె పాతికేళ్ళు పై చిలుకు కాపురం చేసిన మనిషిలాగా లేదు. అందానికి అందం పొంకం బింకం సడలని ఆరోగ్యం. ఆకర్షణ ఉట్టిపడే అలంకారం.

ఆమె విశాల శరీరం మీద విస్తరించిన బంగారు ఆభరణాలు నగల దుకాణంలో మాత్రమే చూడడం కుదురుతుంది. మెడలో, చెవులకీ, ముక్కులకీ, చేతులకీ, నడుంకీ, ఉన్న బంగారం గ్రాముల్లో చెప్పటం కంటే కేజీల్లో చెప్పటం సులభం. ఆమె కాబట్టి సరిపోయింది కానీ,మరి ఏ ఇతర అల్పప్రాణి అయినా ఆ బరువుకు వంగిపోయేది.

'ఇంత బంగారంతో వీధుల్లోకి వచ్చారు. భయంగా ఉండదా?' అంటే అతడి అమాయకత్వానికి దిగులుపడి, తన ఐశ్వర్యానికి అతిశయపడి, హడావుడిగా నవ్వేసింది లక్ష్మి.

'ఆభరణాలు అలంకారానికే! అలమారాలో దాయటం, లాకర్లలో కూరటం దండగ. అలంకరించుకుంటే సొమ్ములు చూస్తారు, సొమ్ముల సొంతదారును చూస్తారు. చూపించుకోవటానికి కాకపోతే సొగసులు దేనికి?' నవ్వేసింది.

'మిమ్మల్ని చూస్తుంటే మీ ఇల్లు చూడాలనిపిస్తుందండి' అన్నాడు రావు.

'రండి చూద్దురుగాని' విజిటింగ్ కార్డు ఇచ్చింది. 'ఆ రోజుల్లో ముప్ఫైలక్షలు, ఇప్పుడు ఎంతలేదన్నా రెండు కోట్లు విలువ చేస్తుంది ఇల్లు. అన్ని హంగులూ ఉన్నాయి, ఇది ఉందా అని అడగకండి. అది ఉంది అని అర్థం చేసుకోండి. ఎప్పుడొస్తారు? వచ్చేముందు ఫోనుచేయండి!'

'తప్పక'

'మీరేం చేస్తారు?'

చెబితే, ఇంత పేదవాడివి మాఇంటికి రారాదు అంటుందేమోనని భయంవేసి,

ఆకుకుఅందక పోకకు పొందక సున్నం మాత్రం చప్పరించి తప్పించుకొన్నాడు రావు.

'పిల్లలెందరు?'

'ముగ్గురు, బాగా చదువుకొన్నారు. మంచి బంధుత్వాలు వచ్చాయి. మంచి ఉద్యోగాలు, మంచి జీతాలు. మమ్మల్ని ఏమీ అడగరు. ఎవరి జీవితాలు వాళ్ళవి. ఇదంతా మేమేం చేసుకొంటాం? అంతా వాళ్ళదే కదా!'

ఆమెకు మొహమాటం లేదు. సడన్‌గా అడిగింది 'తెలంగాణ రాష్ట్రం ఏర్పడుతుందా?' ఎందుకింత అకస్మాత్తుగా ఆ ప్రశ్న వేస్తుందో అర్థం కాలేదు.

'ఏర్పడుతుందనే అనిపిస్తుంది!'

'నాయకులు పోరాడుతున్నారు కదా!'

'అవును!'

'ఏర్పడకూడదు!' తీవ్రంగా పలికింది.

ఈమె సమైక్యవాది అయి ఉంటుంది, వేర్పాటువాది కాదు.

'మీ దేవూరు?' అంది.

'అనంతపురం!'

'అలా చెప్పండి' అంది. అంటే ఏమిటి అర్థం?

'మీకు రాయలసీమ ప్రత్యేకరాష్ట్రం కావాలా వద్దా?'

చాక్‌లెట్ కావాలా వద్దా అని తల్లి కొడుకుని అడిగినట్లుంది.

'సూటిగా చెప్పండి, భయంలేదు, మొహమాటం లేదు. నిక్కచ్చిగా చెప్పండి' అంది.

'వద్దు!'

'ఏం?'

'కలసి ఉంటే కలదు సుఖం'

'సినిమా కబుర్లు కాదు, జీవితం'

'కావచ్చు!'

'వెన్నెముక ఉండాలి!'

ఎదురాడితే పోట్లాడుతుందని భయపడి సుందరరావు మళ్ళీ నోరెత్తితే ఒట్టు.

కూల్‌డ్రింక్ గ్లాసు టేబిల్‌మీద పెట్టి నవ్వింది.

'మీ నవ్వు అందంగా ఉంటుంది!'

మీ కదొక్కటి తెలుసు. సంతోషం. ఒప్పుకొంటాను.' తలాడించింది. తల జుట్టు పైకి సవరించుకొంటూ అడిగింది.

'తెలంగాణా రాష్ట్రం వస్తే అందులో ఎన్ని జిల్లాలుంటాయి?'

'తొమ్మిది!'

'హైద్రాబాదు రంగారెడ్డి జిల్లాలు తెలంగాణలోనే ఉండాలా?'

'ఉంటాయి!'

'ఉండకూడదు!'

'ఎందువల్ల!'

'కేంద్రపాలిత ప్రాంతంగా ఉండాలి'

'పోనీ ఆంధ్రప్రదేశ్‌లోనే ఉంచండి'.

'సాధ్యం కాదు'.

'అయితే తెలంగాణలో చేర్చండి'

'చేర్చరాదు'

'ఎందువల్ల'?

'నా కిష్టం లేదు!'

నా కిష్టం లేదని అంటే సరిపోదని ఆమెకు ఎవరు చెప్పాలి! ఆమెకు ఇష్టం లేకపోతే రాష్ట్రాలు ఏర్పడటమో మానటమో జరిగినట్లేనా?

'మనిష్టం ఏం చెల్లుతుంది?'

'చెల్లుతుంది, చెల్లి తీరాలి!'

ఆమె దృష్టిలో సర్కారు ప్రాంతం. రాయలసీమ, కేంద్రపాలితప్రాంతం, తెలంగాణ మొత్తం నాలుగు ముక్కలు కావటం ఇష్టం లేనట్లుగా ఉంది.

ఆమె శక్తిసామర్థ్యాలు ఏమిటో! రాజకీయ కుటుంబమా? కాంగ్రెసువాదా?

'మీ నాన్నగారు ఏం చేస్తారు?'

'రైతు!'

'వారు కాంగ్రెసు వాదా? గాంధీవాదా? స్వాతంత్ర్య సమరంలో పోరాడారా? రాజకీయ బాధితుల కుటుంబమా?'

'ఇంకా నయం' నవ్వింది. 'గాంధీ కోడలివా? నెహ్రూ కూతురివా?' అని అడగలేదు. 'రాజకీయాలు మాట్లాడటానికి వాళ్ళేనా అర్హులు' ప్రశ్నించింది.

'కాదు కానీ' రావు పూర్తి చేయలేదు.

'ఎందుకండీ నసుగుడు. రాజకీయాలు ఎవరైనా మాట్లాడవచ్చు. అందరికీ అంతో ఇంతో రాజకీయం తెలుసు. ఏ అర్హతా అక్కరలేనిది ఒక్క రాజకీయాలకే!'

కదిలిస్తే కంప, మాట మార్చాడు రావు. మీ తండ్రిగారు బాగా కట్నం కానుకలు పొలం పుట్రా ఇచ్చి ఘనంగా మీ పెళ్ళి చేసినట్టున్నాడు.' అన్నాడు రావు.

'పాపం మా నాన్న పేదవాడు. నలుగురు ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేసి కొడుక్కు నాలుగెకరాలు మాగాణి మిగిల్చేసరికి ఆయన ప్రాణం పోయింది'.

'అంతా మీకే కట్టబెట్టాడన్నమాట'

'అబద్ధం! ఎవరి పెళ్ళికీ ఏమీ కట్నం కానుకలు ఇవ్వలేదు. అప్పుడు నేను అయిదో తరగతి పదకొండో ఏడే. ఎత్తరినా? ఎవడైనా చూచేవాడు. ఇదుగో ఈయన నన్ను చూశాడు. పెళ్ళి చేసుకొంటానన్నాడు. తప్పలేదు. పెళ్ళయింది. పైసా కట్నం లేదు. మరుసటి ఏడు ఈడేరాను. అప్పటినుంచి సంసారం'.

'ఆ రోజుల్లో మీరు మరింత అందంగా ఉండి ఉంటారు.'

'ఉండకేం? అందంగానే ఉన్నాను. మహా సోగ్గత్తెను. ఏ రాజకుమారుడూ చూడలేదు కాబట్టి సరిపోయింది. ఈయన అదృష్టం. చూశాడు. వెంటబడ్డాడు. పెళ్ళాడాడు.'

'మీరేవూరు?'

'రాజమండ్రి!'

'మీ వారిది?'

'అదిలాబాదు!'

'అదీ విషయం' అన్నాడు రావు. మహా హుషారుగా ఉన్నాడు.

'ఏదీ విషయం?' అంది లక్ష్మి.

'మీది సర్కారు. మీ వారిది తెలంగాణ. మీ పిల్లలది హైద్రాబాదు. అందువల్ల మీరు సమైక్యవాది.

'నా బొంద' అని ఊరుకోలేదు. 'అక్కడికి ఇదెంతో, ఇక్కడికి అదంతే' అంది. అంటే ఏమిటో అర్థం చేసుకోవాలి.

'మీ అత్తమామలు – మీ మెట్టినింటివాళ్లు జమీందారులా?'

'అంటే?'

'సంపన్నులా?'

'సంపన్నులా?! ఇంకానయం. కులానికి పేదలు కాదు!'

'అయితే కూటికి పేదలేనా? అయ్యో పాపం!'

'ఏం పాపం! బాగానే ఉన్నారు!'

రావు మరేమీ మాట్లాడలేదు.

లక్ష్మి డ్రైవర్ను పిలిచింది. 'ఏమిటి ఆలస్యం?' అంది. 'అయిపోవచ్చింది' అన్నాడు. 'తొరగా తెములుచ్చు' అంది. తలూపి వెళ్ళాడు.

'మీరు కారులోనే వచ్చారా?'

'అవును!'

'రెండు కార్లూ కావాలా?'

'అక్కరలేదు. పాతదాన్ని అమ్ముతాను. కొంటారా? తీసుకోండి. నేనే కారూ రెండేళ్ళ కంటే ఎక్కువ వాడను. నాకెప్పుడూ కొత్త కారే ఉండాలి. టైరు మార్చే పరిస్థితి వచ్చిందా – ఆ కారు అమ్మాల్సిందే!'

'ఎక్స్చేంజి చేయకపోయారా?'

'తక్కువకు అడుగుతున్నారు. ఇవ్వనన్నాను. ఇంటికి పంపుతారు దాన్ని. నేను డ్రైవర్‌తో క్వాలిస్‌లో వెళతాను'.

'బాగుంది. పాతకారులో వచ్చి కొత్తకారులో వెళ్ళటం!'

'నేను క్వాలిస్ కొనేదాన్నే కాదు. బెంజికొని ఉండేదాన్ని. నలభై ఆరులక్షలు. దీనితో సరిపెట్టుకొన్నాను. ఏం చేయగలం? ఈ దేశం బాగుపడదు. చీలికలు పీలికలై, ముక్కలు చెక్కలై పోతుంది.'

'అంత నిరాశ పనికిరాదు!'

ఆమె రావువైపు ఆశ్చర్యంగా చూచింది. అతణ్ణి నంగిమాటల మనిషి అనుకొంది. నిక్కచ్చిగా మాట్లాడినట్టయి, నిజం చెప్పొద్దూ. ఆమె సంతోషపడి మెచ్చుకోలుగా చూచింది.

ఆమె కడగంటి చూపుకే కదిలిపోయిన రావు బయట పడసాగాడు.

'పూర్వం నైజాం పాలనలో, స్వాతంత్ర్యం వచ్చాక ప్రజాపాలనలో, తెలంగాణ ఆలనాపాలనా ఎవరు చూశారు? ఏం అభివృద్ధి అయింది? ఎంత పేదరికం? ఎంత దౌర్భాగ్యం?'

ఆమె కళ్ళు చికిలించి చూచి, అభినందిస్తున్నట్లు నవ్వింది.

'మీ నవ్వుకు కోట్ల శక్తులున్నాయి.'

'మీ కదొకటి బాగా తెలుసు!'

'ఏది?'

'నా నవ్వు!'

'దానికి వశీకరణ శక్తులున్నాయి'

'అవునా?' ఆమె చాలా చక్కగా మహాముచ్చటగా నవ్వింది.

'మీ నవ్వు హైదరాబాదు నగరాన్ని కొనగలదు!'

'నా బొంద. నా నవ్వును ఆయన వెకిలినవ్వు అంటారు. మీరొక్కరే అంతలా మెచ్చుకొంది. అందుకే మీరు నాకు నచ్చారు'

'థాంక్సండి!'

'సరేగాని తెలంగాణ గూర్చి మీకేమీ తెలియదన్నారు కానీ, మీ అభిప్రాయాలు మీకూ ఉన్నాయి'

'ఉండవా మరి?'

'ఈ ప్రాంతం నాయకులు ఏం చేశారు? ఎవరి స్వార్థం వాళ్ళు చూసుకొన్నారు. అది మేలే అయింది.'

'బూర్గుల దగ్గర నుంచి చొక్కారావు దాకా చాలా శ్రమించారు!'

'వేస్ట్!'

'చెన్నారెడ్డి!'

'దండగ!'

'ఎందుకు?'

'బ్రహ్మానందరెడ్డిని దించాలని'

'దించి?'

'తాను పార్లమెంటుకు పోవాలని, గవర్నరు కావాలని, మళ్ళీ రాష్ట్ర ముఖ్యమంత్రి కావాలని- తనకోసం - తెలంగాణ కోసం కాదు.'

'ఒకనాటి రాజకీయ వాతావరణం వేరు. నేటి పరిస్థితి వేరు. అది స్వార్థమయితే ఇది ప్రజార్థం'

'వేరూ లేదు, చెట్టూలేదు, అంతా ఒకటే కుదురు!

'అలా కుదరదు. ప్రజలు చైతన్యవంతులయ్యారు. నక్సలైట్లు తెలంగాణ రాందే ఊరుకోరు. స్వార్థ రాజకీయాలు సాగనివ్వరు.'

'వాళ్ళు కొంత మేలే!'

'చంద్రశేఖరరావు ఎన్ని గొడవలు తట్టుకొని పోరాడుతున్నారు?'

'నిజమే! కొంతమేలే!'

లక్ష్మి ఆ మాట అంటుందని రావు ఊహించలేదు.

'నా పెళ్ళయిన కొత్తలో హైదరాబాదు అట్ల కాడలా ఉండేది. ఇప్పుడు పొట్లకాయలా తయారయింది.'

'అంటే?'

'పెరిగింది!'

'ఏం జరిగింది?'

'సర్కారు, రాయలసీమ జనం నగరం మీదికి ఎగబడి, దొరికిన ప్రతి అంగుళం నేల కొని, ఇళ్ళు కట్టి, ఫ్యాక్టరీలు తెచ్చి, మిల్లులు పెట్టి, రియల్ ఎస్టేటు వ్యాపారం చేసి, హైద్రాబాదును సుందరనగరం చేశారు?'

'అంతేకాదు, వాళ్ళే తెలంగాణ భూముల్ని చవకగా కొని, అడవులు తెగనరికి, కట్టెలమ్మి, బొగ్గులమ్మి, వ్యవసాయం చేసి, ఆస్తులు పెంచుకొని, తాము సంపన్నులై పేదల్ని, పేదలుగానే ఉంచి, లేకపోతే నిరుపేదలుగా మార్చారు. కూటికి లేనివాళ్ళుగా వచ్చి, కోటీశ్వరులై, రాజకీయాలు చేస్తున్నారు.'

'వాళ్ళవల్లే భూమి విలువ పెరిగింది. పైసాకు తరంగాని, ఓమ కూడా పండని ఊసరక్షేత్రాలు సంపన్న మాగాణాలుగా మార్చారు. వాళ్లవల్లే భూమికి ఈమాత్రం విలువ ఇవాళ!'

'వాళ్ళది దోపిడీ సంస్కృతి, సంపద సొంతం చేసుకొన్నారు. అవకాశాలు అందుకొన్నారు. ఉద్యోగాలు కొల్లగొట్టారు. చదువుకు దూరం. అభివృద్ధికి దూరం. అసలు రోత ఏమిటి? చిన్నచూపు. తెలంగాణ అంటే చిన్నచూపు. పేదరికం చిన్నచూపు. అమాయకత్వం చిన్న చూపు. బతుకన్నా తేలిక. భాషన్నా తేలిక. ఇది భరించటం కష్టం!'

'దానికి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రమే పరిష్కారమా?'

'కొంతవరకు!'

'ఆపైన?'

'అభివృద్ధి చెందాలి!'

'ఎవరు అభివృద్ధి చేస్తారు?'

'ప్రజలే! వాళ్ళను వాళ్ళ ఉద్ధరించుకొంటారు!'

'ఇంతకాలం ఎందుకు ఉద్ధరించుకోలేదు?'

'ఇంతకాలం వాళ్ళను వాళ్ళు పాలించుకోలేదు. పరాయి పాలనలో బతికారు'.

'సర్కారు, రాయలసీమ సోదరుల సహాయం పొందవచ్చు కదా!'

'సహాయం దోపిడీకి మారుపేరు కారాదు'

లక్ష్మి పైకి లేచింది. దగ్గరగా వచ్చింది. కళ్ళార్పకుండా చూచింది. కనురెప్పలు రెపరెపలాడించింది. మెచ్చుకోలుగా నవ్వింది. భుజం మీద కొట్టి అభినందించింది.

'మీరు నాకు నచ్చారు– మా ఆయనా ఇంతే! మీ మాటలు ఆయన మాటల్లాగే ఉన్నాయి. – ఒకసారి మా యింటికి రండి – మాఇంట్లో భోజనం చెయ్యాలి – ఆతిథ్యం స్వీకరించాలి. – మా ఆయన్ని పరిచయం చేస్తాను – మిమ్మల్ని చూస్తే సంతోషిస్తారు' ఆగకుండా మాట్లాడుతూనే ఉంది.

'అయితే ప్రత్యేక తెలంగాణ రావటం మంచిదేనంటారు మీరు' అన్నాడు రావు.

'బలేవాళ్ళే, నేనెందుకంటా నామాట. అనను' నిక్కచ్చిగా చెప్పింది.

'ఈ మధ్య సర్కారువాళ్ళు. రాయలసీమవాళ్ళు హైద్రాబాదు రావటం లేదు. ఇళ్ళు కట్టటం లేదు. ఇళ్ళస్థలాలు కొనటం లేదు. తెలంగాణభూములు ఎవరికీ అక్కరలేదు. ఎవరూ ఇక్కడ స్థిరపడటం లేదు'

'ఎందువల్ల?'

'తెలంగాణ వస్తుందని!'

'వస్తే ఏం?'

'పరాయి రాష్ట్రంలో ఉండే ఇష్టంలేక!'

'మంచిదే! ఏర్పడబోయే రాష్ట్ర సంపద పరాయివాళ్ళు హక్కు భుక్తం కాకుండా ఉండటం శ్రేయస్కరమే కదా!'

'ఏం శ్రేయమో ఏమో! అమ్మకాలు లేవు. కొనుగోళ్ళు లేవు. క్రయవిక్రయాలు సున్నా, లావాదేవీలు బంద్, రేట్లు డౌన్. పొలాలు స్థలాలు అమ్ముకొని బాగా లాభపడదామనుకొనే తెలంగాణ వాసులనోట దుమ్ము. స్తబ్ధత. దారిద్ర్యం అంటగడుతూ ఉంది. రాష్ట్రం మాట తలెత్తకముందు బాగా పొలాలు స్థలాలు అమ్ముకొన్న వాళ్ళు లాభపడ్డారు. సుఖపడ్డారు. మంచిరేటు వస్తుంది, మళ్ళీ అమ్ముకొందామనుకొన్నవాళ్ళకు ప్రత్యేకరాష్ట్రం పీడ చుట్టుకొని పాడయి పోయారు. ఇంకా పాడవుతున్నారు. పాడవుతారు. ప్రత్యేకరాష్ట్రం రారాదు.'

'రాకపోతే!'

'భూములు స్థలాల క్రయవిక్రయాలు బాగా జరగాలి'

'జరిగితే?'

'తెలంగాణ వాసులు సంపన్నులవుతారు?'

'అందువల్ల తెలంగాణ అభివృద్ధి అవుతుందా?'

'ఆపైన నగరం రాయలసీమ, సర్కారు వాళ్ళ పెట్టుబడులతో పెరిగి పెద్దదవుతుంది.'

'తెలంగాణ ఏమవుతుంది?'

'అదీ అభివృద్ధి చెందుతుంది!'

'ఎలా – ఇళ్ళు లేక, ఇళ్ళ స్థలాలు లేక, భూముల్లేక, అమ్మితే వచ్చిన డబ్బు తగలబడి పోయి ఏమీ లేనివాళ్ళుగా తెలంగాణ వాసులు మిగిలిపోయే ప్రమాదం గుర్తించారా? అభివృద్ధి జరగాలంటే పొలాలు ఉండాలి. అమ్ముకోకూడదు. పండాలి. పరిశ్రమలు రావాలి. ఉత్పత్తులు పెరగాలి. తాగునీరే కాదు సాగునీరు కావాలి. ప్రాజెక్టులు రావాలి.

'ఆగండి' గర్జించింది. 'కృష్ణజలాలు నగరంలోకి వచ్చాయి. చాలదా?' ప్రశ్నించింది.

'చాలదు. తాగునీరు అవసరమే. అంతకంటే సాగునీరు అవసరం. కృష్ణాజలమే కాదు, గోదావరి జలం కూడా కావాలి. నదుల అనుసంధానం ఉండాలి. ఒక్క నీటిబొట్టు కూడా వృథాగా సముద్రంలో కలవకూడదు! తెలంగాణ భూములు సస్యశ్యామలం కావాలి'

'ప్రభుత్వం చేస్తూనే ఉంది కదా!'

'చాలినంత చేయటం లేదు. చేయవలసినంత చేయటం లేదు. తెలంగాణ వాసులు తమకు కావలసింది తాము చేసుకోగలగాలి. అందుకు తమ ప్రభుత్వం ఉండాలి కాబట్టి ప్రత్యేక రాష్ట్రం వచ్చి తీరాలి.'

'సోదరులు చీలిపోరా?'

'అన్నదమ్ములు పెళ్ళయి, పిల్లలు కలిగి, వేరైపోవటం మామూలే కదా!'

'కలసి ఉంటే కలదు సుఖం అంటిరే!'

'కలసి ఉండలేనప్పుడు సుఖంలేదు'

ఉన్నట్టుండి లక్ష్మి 'బెంజికారు కొనలేకపోయాను' అని బాధ పడసాగింది.

'అదే అడుగుదామనుకొంటున్నాను. ఎందుకు కొనలేకపోయారు?'

'రాబడి తగ్గిపోయింది!' పొలాల రాబడో, స్థలాల రాబడో, ఏది తగ్గిపోయిందో తెలియలేదు. అడగటం బాగుండదని రావు మానేశాడు.

'ఇక మీకు క్వాలిస్ తప్పదు!'

'తప్పదు!'

'మీ వారు పాతకారు వాడరా? అమ్ముతానంటిరే!'

'వాడను! అమ్ముతాను'

'ఎందుకు వాడరు!'

'ఆయనకు ఆఫీసు కారుంది. ఆయన గాని క్వాలిస్‌లో పోతే ఏడుస్తారు. బెంజికారులో వెళితే చచ్చిపోతారు. చూళ్ళేరు. కుళ్ళుజనం. కుళ్ళుబుద్ధులు. కుళ్ళుబోతులీ మనుషులు'

ఆమె కోపం ఎవరి మీదో తెలుసుకొనే ప్రయత్నంలో ఉండగానే మధ్యలో ఆమె అడిగింది.

'మీరేం చేస్తుంటారో సరిగ్గా చెప్పలేదు'

'ఏం చేయను. రిటైరు అయ్యాను'

'అప్పుడే?'

'అయిదేళ్ళయింది!'

'విఆర్‌యస్సా?'

'కాదు అరవై ఏళ్ళకే!'

'మీరంతా పెద్దవాళ్ళా? చిన్నవారనుకొన్నాను. నాకంటే కూడా చిన్న అనుకున్నారు. అయితే ఆరోగ్యం బాగాకాపాడుకొంటున్నారు. పెళ్ళి చేసుకొంటానంటే ఏ అమ్మాయి అయినా రెడీ అవుతుంది.'

'నాకు భార్య ఉంది!'

'ఏం భార్య! అమ్మమ్మ ! నాయనమ్మ ! అమ్మా అయ్యా అంటూ ముక్కుతూ మూలుగుతూ నడవలేక, కూర్చోలేక ఆడమనిషి యాభై దాటితే ఎందుకూ పనికి రాము. అదే మగవాడయితే, ఎప్పుడూ మగవాడే! చూడండి నాకు ఇప్పుడు మగడంటే వల్లమాలిన రోత! పూర్వం ఎంత ఇష్టం! ఇప్పుడు లేదు.'

ఆమె దాపరికంలేని మనిషి. మాట్లాడటం ఆమె హక్కు ఆస్తి, సంపద, సత్కాలక్షేపం.

'అందరూ అలా ఉండరులెండి. నా భార్యకు ఇప్పటికీ నేనంటే చెప్పలేనంత ఇది'

'ఇదా? ఏందదీ?' గలగలా జలజలా గబగబా దబదబా నవ్వింది. ఇంగువకట్టిన గుడ్డ. ఆమె సంతోషం ఆమె సొంతం. అది జ్ఞాపకాల అట్టడుగు పొరల్నుంచి ఎగదన్నుకొచ్చిన ఆనందం.

'మీ నవ్వుతో మీరు లోకాన్ని కట్టిపడెయ్యగలరు?'

'నిజమే! కాని మా ఆయన్ని మాత్రం దగ్గరకు రానీను. దూరం దూరం'

'జాగ్రత్త!'

'ఏం?'

'ఎవరినైనా వేరే అమ్మాయిని చూసుకొనే ప్రమాదం ఉంటుంది'

'ఏం రోగం?'

'కోర్కెలు తీరకపోతే ప్రత్యామ్నాయం కావాలికదా! తెలంగాణ కోర్కెలు తీరకపోతే ప్రత్యేక రాష్ట్రం కావలసిరాలేదూ? మీరు పెద్దభార్య అయిపోయే పరిస్థితి తెచ్చుకోవద్దు. మీ ఇంట్లో చిన్నరాష్ట్రం ఏర్పడకుండా చూచుకోండి.'

'బలేవారే! చమత్కారంగా మాట్లాడుతున్నారు. రాష్ట్రం విడిపోయినట్లే, కుటుంబం విడిపోకూడదంటున్నారా? అందుకే కదా? రాష్ట్రం ముక్కలు కారాదు అంటున్నాను' అంది.

'అంటే చాలదు, అందుకేం చేయాలో చూచి, ఆలోచించి ఆచరించాలి'

'మంచి మాటే థాంక్స్!'

'మీవారు ఏం చేస్తుంటారు?'

'ఫోంచేస్తుంటారు?'

'ఇంకా?'

'సంసారం!'

'అది సరేనండి, ఉద్యోగం?'

'రిజిస్ట్రారు!'

'ఏ యూనివర్శిటికీ?'

'యూనివర్శిటీ ఏమిటి?'

'మరేం రిజిస్ట్రారు?'

'రిజిస్ట్రారు, యూనివర్శిటీ రిజిస్ట్రారు కాదు. రిజిస్ట్రేషన్ ఆఫీసు రిజిస్ట్రారు. పెళ్ళిళ్ళ రిజిస్ట్రేషన్ ఆఫీసు. భూములు ఇళ్ళ స్థలాల క్రయవిక్రయాలు రిజిస్ట్రేషన్ ఆఫీసు. కోట్ల ఆస్తులు. కోట్లకొనుగోళ్ళు. కోట్ల అమ్మకాలు. కోట్లు చేతులు మారటం, పేదలు కోటీశ్వరులవటం, క్లోజ్. మారిపోయింది. చౌరాస్తా స్టాండ్ స్టిల్. వ్యాపారం డల్ నిల్. ట్రాఫిక్ జాం. బస్ బంద్! గప్‌చిప్. కొనేవాళ్ళు లేరు. అమ్మేవాళ్ళులేరు. టేబిల్ కిందా లేదు, మీదా లేదు. రాబడేలేదు. పాడు రాష్ట్రం వచ్చిందీ లేదు, చచ్చిందీ లేదు. ఆదాయం అడుగంటింది. రాబడి ఆగిపోయింది. దరిద్రం చుట్టుకొంది. బెంజికారు కొనలేకపోయాను. దురదృష్టం!'

సుందరరావుకు బెంజికారు లాంటి లక్ష్మి క్వాలిస్‌లో పోతుంటే దిగులుగా అనిపించింది.